ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



కర్ణాటక వార్తలు

బుధవారం 14 మే 2025

ఎయిమ్స్ పోరాటానికి మూడేళ్లు పూర్తి..!



చెప్పులు చేత పట్టుకుని నిరసనలో పాల్గొన్న నాయకులు

8

గ్రామ ఖజానా.. గల..గల..!



పన్నువసూళ్లో ప్రథమ స్థానంలో నిలిచిన మంచ నాయకనహళ్ళి పంచాయతీ

- ఆస్తిపన్నుతో పెరిగిన ఆదాయం
- రాష్ట్రవ్యాప్తంగా గతేడాది రూ.500 కోట్లకు పైగానే వసూళ్లు
- రియల్ ఎస్టేట్, కర్మాగారాలతో మరింత జోరు
- మెరుగవుతున్న మౌలిక సౌకర్యాలు

బంగారపేట, మే 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ పంచాయతీల్లో ఆదాయం భారీగా పెరిగిపోయింది. గతంలో రూ.వేలల్లో ఉన్న వసూళ్ల నేరు రూ.లక్షలు దాటి రూ.కోట్లకు చేరుకుంటున్నాయి. ఇంటి పన్నులతోపాటు ఆదాయపన్ను వసూళ్ల పెరిగిపోయాయి. దేశానికి స్వాతంత్ర్యం లభించి 75ఏళ్ల గడిచినా దాదాపు 40ఏళ్లకుపైగానే పల్లెల్లో ఇంటిపన్ను, ఆస్తిప న్నులు నామమాత్రంగా ఉండేవి. కొన్ని పంచాయతీలలో దశాబ్దా లకాలం ఇంటిపన్ను వసూలు చేసిన దాఖలాలు కూడా లేవు. ఇది రాష్ట్రంలోనే కాదు దేశవ్యాప్తంగాను కొనసాగింది. అందుకు ప్రధాన కారణం పల్లెల్లో ఒకప్పుడు మట్టి ఇల్లు, గుడిసెలు, పెంకు టిల్లుతోపాటు పైకప్పులు సైతం మట్టితో కూడిన ఇళ్ల ఉండేవి. దీంతో ఏడాదికి ఇంటిపన్ను 10 రూపాయలలోపుగానే వచ్చేది. తక్కువమొత్తం కావడంతో పంచాయతీ సర్పంచ్‌లు వసూళ్లకు ప్రాధాన్యం ఇచ్చేవారు కాదు. ఇలా ఇంటి పన్ను ఎక్కువగా వసూలయ్యే పరిస్థితి ఉండేది కాదు. దీనికితోడు సర్పంచ్‌లుగా కొనసాగేవారు పన్నుల పట్ల ఆసక్తిచూపేవారు కాదు. కానీ ఇటీవలికా లంలో పల్లె ప్రాంతాలలోనూ పరిశ్ర మలు, రియల్ఎస్టేట్ సహా వివిధ వ్యాపారాలు తలెత్తాయి. దీంతో పన్నులు కూడా భారీగానే పంచా యతీలకు చేరుతోంది.

గతేడాది వసూళ్లు రూ.571 కోట్లు

రాష్ట్రంలో 5,950 గ్రామపంచాయతీలు ఉన్నాయి. 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.571 కోట్ల రూపాయలు పన్నుల రూపంలో వసూలు చేశారు. 2023-24 నాటికి అది రూ.761 కోట్లకు పెరిగింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.1,272 కోట్లు రికార్డు స్థాయిలో వసూలైంది. ఇందులో బెంగ ళూరు నగర, గ్రామీణ పరిసర ప్రాంతాలలోని గ్రామపంచాయతీలు రికార్డుస్థా యిలో వసూళ్ల సాధ్యమయ్యాయి. ఇంకా గ్రామపంచాయతీల పరిధిలో రూ.2657 కోట్లు పన్నుల బకాయి ఉన్నాయి. వాటిని వసూలు చేసేందుకు గ్రామ పంచాయతీలు నిర్లక్ష్యం చేస్తున్నాయి. ఇలా కోట్లాది రూపాయల వసూలు ద్వారా పంచాయతీల్లో అభివృద్ధి పనులకు అవకాశాలు మెరుగవుతున్నాయి. ఒకప్పుడు కేవలం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గ్రాంట్లపైనే రోడ్లు, మురుగు కాలువల నిర్మాణం, తాగునీటి సౌలభ్యాలు కల్పించేవారు. పన్నుల వసూళ్లలో కోట్లాదిరూపాయలు సాధ్యం అవుతుండడంతో వాటి ద్వారా మౌలిక సదుపాయాలను జాప్యం లేకుండా డిమాండ్‌ను బట్టి అమలు చేస్తున్నారు.

రాష్ట్రంలో అత్యధిక ఆదాయం ఉన్న పది పంచాయతీలు

తాలూకా	గ్రామపంచాయతీ	2022-23	2023-4	2024-25
		(రూ.కోట్లలో)		
రామనగర	మంచనాయకనహళ్ళి	11.05	15.51	18.37
ఆనేకల్	హెన్నాగర	5.05	15.09	18.19
దేవనహళ్ళి	అన్నేశ్వర	6.11	10.01	15.03
ఆనేకల్	నెరళూరు	2.93	7.97	10.46
ఆనేకల్	యమరె	5.48	7.49	10.35
యలహంక	బండికొడిగెహళ్ళి	3.78	6.03	9.10
ఆనేకల్	కల్లుబాలు	1.94	5.34	8.79
దేవనహళ్ళి	కన్నమంగల	5.56	6.13	8.55
బెంగళూరు	దక్షిణ కుంబళగోడు	2.28	5.88	8.53
బెంగళూరు	తూర్పు సీగేహళ్ళి	3.05	6.01	8.38



మంచనాయకనహళ్ళి పంచాయతీ కార్యాలయం

బెంగళూరు నగర పరిధిలో 85 గ్రామపం చాయతీలనుంచి రూ.296 కోట్లు, బెంగ ళూరు గ్రామీణ పరిధిలోని ఒక గ్రామపం చాయతీ నుంచే రూ.120 కోట్ల పన్ను లను వసూలు చేశారు. అయితే రామ నగర జిల్లా మంచనాయకనహళ్ళి గ్రామపంచాయతీలో 2024-25లో రూ.18.37 కోట్లు వసూళ్ల ద్వారా ప్రథ మస్థానంలో నిలిచింది. బిడది పారిశ్రా మికవాడ పరిధిలో ఉన్నందున ఎక్కువ పన్నులు సాధ్యమయ్యాయి. బెంగళూరు నగర జిల్లా ఆనేకల్ తాలూకా హెన్నాగర గ్రామపంచాయతీ రూ.18.91కోట్లు, గ్రామీణ జిల్లా దేవనహళ్ళి తాలూకా అన్నేశ్వర గ్రామపం చాయతీలో రూ.15.03 కోట్ల వసూళ్లతో రాష్ట్రంలో మూడోస్థానంలో ఉంది. గత ఏడాది ఇదే పంచాయతీ 16.91 కోట్లతో రాష్ట్రంలోనే ప్రథమస్థానంలో ఉన్నా ఈ ఏడాది పన్నులు తగ్గాయి. మంచనాయకనహళ్ళి గ్రామపంచాయతీ పరిధిలో 15.51 కోట్ల రూపాయలు సాధ్యమయ్యాయి. హెన్నాగర గ్రామపంచాయతీలో

నగర పరిధిలో మరింత జోరు..

350కుపైగా పరిశ్రమలు ఉన్నందున పన్నుల రూపంలో ఆదాయం సాధ్య మవుతోంది. అన్నేశ్వర గ్రామపంచాయతీ పరిధిలో కెంపేగౌడ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ ఉన్నందున ఖజానాకు భారీగానే పన్నుల రూపంలో వసూలు అవుతున్నాయి.

నిబంధనలతో ఆదాయంలో కోత..

అన్ని గ్రామాలు ఆదాయంలో కళకళలాడుతుంటే కొన్ని గ్రామాల్లో మాత్రం నిబంధనలతో ఆదాయంలో కోతలు పడుతున్నాయి. గ్రామాల సమీపాన భారీ పరిశ్రమలున్నా ఆదాయం పల్లెలకు అందడం లేదు. దీంతో ఉపాధి తప్ప ఊరికి మేలు కలిగిందేమీ లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కర్ణాటక పారి శ్రామిక ప్రదేశ అభివృద్ధి మండలి (కేఐఏడీబీ) బిల్లుకు సవరణ తీసుకొచ్చారు. కేఐఏడీబీ ప్రదేశాన్ని స్పెషల్ ఎకనమిక్ జోన్ (సెజ్)గా ప్రకటించారు. గతంలో పరిశ్రమలు, పారిశ్రామికవాడలు ఏర్పాటైనా గ్రామపంచాయతీకి పన్నులు చెల్లించాలనే నిబంధన ఉండేది. చట్ట సవరణతో సెజ్‌గా మార్చిన మేరకు గ్రామపంచాయతీల ఆదాయంలో కోతపడింది. రానున్న నాలుగైదే ళ్లలో మరిన్ని గ్రామపంచాయతీలకు పన్నుల కోత ఏర్పడే అవకాశం ఉంది. అయితే చట్టాన్ని సవరించాల్సిన అవసరం ఉందని పలువురు కోరుతున్నారు.

తండా వాసులకు శాశ్వత నివాసాలు

- గ్రామ పంచాయతీ హోదాలో మెరుగైన మౌలిక సౌకర్యాలు
- రెవెన్యూ మంత్రి కృష్ణ బైరేగౌడ



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కృష్ణ బైరేగౌడ

బళ్లారి సిటీ, మే 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని హట్టి , తండా వాసులకు శాశ్వత నివాస సౌకర్యం కల్పించడం, తండాలకు రెవెన్యూ గ్రామ హోదా ఇవ్వడానికి ప్రభుత్వం కట్టుకబడి ఉందని రెవెన్యూ మంత్రి కృష్ణ బైరైగౌడ అన్నారు. నగరంలోని జిల్లాకలెక్టర్ కార్యాలయ హాల్లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో రెవెన్యూ గ్రామాలుగా మార్చడానికి అర్హత ఉన్న తండాలకు 30నాటికి తుది నోటిఫికేష్ జారీ చేయాలన్నారు. గ్రామాలుగా గుర్తించకపోవడంతో అక్కడి నివాసితులు అనేక ప్రభుత్వ సౌకర్యాలను కోల్పోతున్నారని, గుడిసెలు తాండాల నివాసితుల ఇళ్లకు చట్టపరమైన రక్షణ కల్పిం చాలన్నారు. భూ రెవెన్యూ శాఖ యొక్క అన్ని రికార్డులను డిజిటలైజ్ చేసే లక్ష్యంతోభూ భద్రతా ప్రాజెక్ట్‌ను చేపట్టారు, ఈప్రాజెక్ట్‌ను వేగవం తంగా అమలు చేయాలి. సగటున 10,000 పేజీలను స్కాన్ చేసి అప్ లోడ్ చేయాలని మంత్రి అన్నారు. దీనిపై జిల్లాకలెక్టర్ ప్రశాంత్‌కుమా ర్ మిశ్రా మాట్లాడుతూ రెవెన్యూ గ్రామాల ఏర్పాటు కోసం జిల్లాలో మొత్తం 74గ్రామాలను గుర్తించామని, 71గ్రామాలకు ఇప్పటికే ప్రాథ మిక నోటీసులు వచ్చాయని ,51గ్రామాలకు ప్రభుత్వం తుది నోటిపికేష న్ కజారీ చేసిందన్నారు. ఒక గ్రామాన్ని తుది నోటిపికేషన్ కోసం సమ ర్పించామని తెలిపారు. మరో 19గ్రామాలు తుది నోటిపికేషన్‌కు పెండిం గ్‌లో ఉన్నాయన్నారు. రెవెన్యూ గ్రామాలకు జూన్ 30వకు గుడువు విధించగా కొత్త రెవెన్యూ యూనిట్ల ఏర్పాటుపై నిషేధం వర్తి స్తుందన్నారు. ఈ నిషేధాన్ని ఎత్తివేయడానికి రెండు సంవత్సరాలు పట్టవచ్చు ఈవిధంగా పెండింగులో ఉన్న అన్ని రెవెన్యూ గ్రామాల ఏర్పాటు జూన్ నాటికి పూర్తవుతాయన్నారు. 30వ తేది నాటికి పూర్తి చేయాలని ఆయన కోరారు. గ్రామానికి ఒక కిలోమీటరు దూరంలో ఉండి 10కంటే ఎక్కువ ఇళ్ళు ఉంటే ఉపగ్రామంగా ఏర్పాటు చేయడం సాద్యమేనన్నారు. జిల్లాలో దాదాపు 70వేలు భూములు ఇప్పటికీ మరణించిన వారిపేరు మీదే ఉన్నాయని, ప్రత్యేక అభియాన ద్వారా రెవెన్యూ సమస్యలు పరిష్కరిస్తామన్నారు. సమావేశంలో ఎంపీ తుకారం, సండూర్ ఎమ్మెల్యే అన్నపూర్ణ, జిల్లాపంచాయితీ సీఈఓ మహ్మద్ హారీశ్, అదనపు జిల్లా కలెక్టర్ మహ్మద్ జుబైర్, జిల్లాలోని ఐదు తాలూకాల తహశీల్దార్లు , అధికారులు పాల్గొన్నారు.

ఆయిల్ గోడౌన్‌లో మంటలు

బెంగళూరు, మే 13(ఆంధ్రజ్యోతి): బెంగళూరు శివారు నెలమంగల పరిధిలోని అడకమారనహళ్ళి వద్ద గోడౌన్‌లలో నిల్వ చేసిన ఆయిల్ మంటల్లో కాలిపో యింది. మాజీ మంత్రి హెచ్‌సీ శ్రీకంఠయ్య అల్లుడు కృష్ణప్పకు చెందిన గోడౌన్‌లలో మంగళవారం తెల్లవా రుజామున 3 గంటలకు మంటలు చెలరేగాయి. మంటలను గమనించిన స్థానికులు అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చే సరికి మంటలు భారీగా అంటుకు న్నాయి. 10 కిలోమీటర్ల దాకా పొగ, మంటలు కనిపిం చాయి. రూ.30కోట్ల విలువైన ఆయిల్ కాలిపోయినట్లు సమాచారం. 60కుపైగా ఫైరింజన్‌లు 12 గంటలపాటు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చాయి.



భారీగా చెలరేగుతున్న మంటలు

పాక్‌పై పోరాటానికి సిద్ధం

- ప్రభుత్వం అనుమతిస్తే కదనరంగంలోకి: మాజీ సైనికులు



మీడియాతో మాట్లాడుతున్న మాజీ సైనికుల బృందం

బెంగళూరు, మే 13(ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్‌పై పోరాడేందుకు సిద్ధంగా ఉన్నామని, ప్రభుత్వం పిలువునిస్తే వెనుకడుగు లేదని దావణగెరె జిల్లా మాజీ సైనికులు తెలిపారు. కశ్మీర్ పహల్గాం సంఘటన తర్వాత ఉద్రిక్తత చోటు చేసుకోవడం, దాడులు కొనసాగిన తరుణంలో దావణగెరె జిల్లాలోని మాజీ సైనికులు మంగళవారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. 20-25ఏళ్లపాటు బీఎస్ఎఫ్, నౌకాయానంతోపాటు ఎయిర్‌ఫోర్స్‌లో పనిచేసిన అనుభవం ఉందని పలువురు తెలి పారు. జిల్లాలో 570మంది మాజీ సైనికులు ఉన్నామన్నారు. మాజీ సైనికుడు బసవరాజ్ మాట్లాడుతూ 24ఏళ్లపాటు తుఫ్కానా రెజిమెంట్‌లో వైర్‌లెస్ ఆపరేటర్‌గా పనిచేశానన్నారు. శివమొగ్గ సైనిక్ బోర్డ్ నుంచి జిల్లా ఎస్పీకి గతంలో ఇటువంటి ప్రతిపాదన పంపామన్నారు. యుద్ధం జరిగితే తమ సేవలు వినియోగించుకోవాలన్నారు. క్లిష్ట పరిస్థితుల్లో దేశం కోసం పని చేసేందుకు అభ్యంతరాలు లేవని, వయసు ఇతరత్రా కారణాలు లెక్క చేసేది లేదన్నారు.

చోరీ సొత్తు రికవరీ

- రూ.1.48 కోట్లు స్వాధీనం
- సిబ్బందికి కమిషనర్ ప్రశంసలు




స్వాధీనం చేసుకున్న నగదును చూపుతున్న నగర పోలీస్ కమిషనర్ దయానంద్

బెంగళూరు, మే 13(ఆంధ్రజ్యోతి): నగరంలో భారీ నగదు చోరీ కేసును పోలీసులు ఛేధించారు. కేసు వివరాలను నగర పోలీస్ కమిషనర్ దయానంద్ మంగళవారం మీడి యాకు వివరించారు. వయ్యాలికావల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కోదండరాయపురలో చార్టెడ్ అకౌంటెంట్ కార్యాలయం నిర్వహిస్తున్న వ్యక్తి ఈనెల 6న వయ్యాలికావల్ పోలీసు లకు ఫిర్యాదు చేశాడు. కస్టమర్లకు చెందిన ట్యాక్స్ మొత్తం రూ.1.51 కోట్లు బ్యాంకులో జమ చేయాలని కారు డ్రైవర్‌కు ఇచ్చానని అయితే నగదుతో ద్విచక్రవాహనంపై పారిపోయాడ న్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు వివిధ కోణాల్లో దర్యాప్తు చేశారు. కారు డ్రైవ ర్‌కు నోటీసు జారీ చేయగా ఈనెల 9న స్టేషన్‌కు హాజరై నేరం అంగీకరించాడన్నారు. నింది తుడి నుంచి రూ.1,48,36,500 నగదు, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈనెల 10న నిందితుడిని కోర్టులో హాజరు పరచగా జ్యూడీషియల్ కస్టడీకి ఆదేశించారన్నారు. కేసును ఛేధించిన సీఐ శంకరగౌడ బసనగౌడ, ఇతర సిబ్బందిని అభినందించారు.

పిడుగుపాటుకు అన్నదమ్ముల దుర్మరణం

- గొర్రెల కాపర్లను కాటేసిన ప్రకృతి
- తీవ్ర గాయాలతో మరో తమ్ముడి కుమారుడు..
- బళ్లారి జిల్లాలో తీవ్ర విషాదం



మృతి చెందిన బీరప్ప

బళ్లారి, మే 13 (ఆంధ్రజ్యోతి): పిడుగు పాటు అన్నదమ్ములను బలిగింది. గొర్రెలు మేపేందుకు అడవికి వెళ్లిన కాపర్లను ప్రకృతి కాటేసింది. ఒకే కుటుంబానికి చెందిన అన్నద మ్ములు మృత్యువాత పడ్డారు. మరో యువకుడు తీవ్ర గాయ లకు లోనై బళ్లారి విమ్స్ ఆసుప త్రిలో చికిత్స పొందుతున్నారు. మంగళవారం మధ్యాహ్నం బళ్లారి జిల్లా సిరుగుప్ప తాలూకా రారావి గ్రామం వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం సిరుగుప్ప తాలూకా రారావి గ్రామానికి చెందిన గొర్రెల కాపరి బీరప్ప, ఆయన సొంత తమ్ముడు సునీల్, మరో తమ్ముడి కుమారుడు వినోద్ ముగ్గురు కలిసి మంగళవారం రారావి సమీపంలో ఉండే అడవికి గొర్రెలను మేతకు తోలుకెళ్లారు. సోమవారం మధ్యాహ్నం దాటిన తరువాత ఉరుములు మెరు పులు లతో తేలిక పాటి జల్లులు కురిశాయి. పక్కనే ఉండే చెట్టు కిందకు వచ్చి వారు తలదాచుకున్నారు. బీరప్ప(40), ఆయన తమ్ముడు సునీల్(25) చెట్టుకు ఒక వైపు ఉన్నారు. వినోద్ 15 ఏళ్ల బాలుడు మరో పక్క నిలబడి ఉన్నాడు. అయితే ఉరుములతో పాటు పిడుగు పడడంతో బీరప్ప, సునీల్ తీవ్ర గాయాలతో అక్కడిక క్కడే కన్ను మూశారు. పిడుగు పడిన విషయాన్ని స్థానికులు గమనించి వినోద్‌ను బళ్లారి విమ్స్‌కు తర లించి చికిత్స అందిస్తున్నారు. ఒకే కుటుంబంలో ఇద్దరు చని పోవడంతో రారావిలో విషాద చాయలు అలుముకున్నాయి. మృతుడు బీరప్పకు బార్య అమ రమ్మ, ఇద్దరు ఆడబిడ్డలు, ఒక మగ పిల్లవాడు ఉన్నారు. సునీల్ కు భార్య సుమలత ఒక మగపిల్లవాడు ఉన్నారు. వినోద్ పదవ తరగతి పూర్తి చేసి సెలవులు కావడంతో గొర్రెల కాసేందుకు వెళ్లాడు. వినోద్ పరిస్థితి కూడా విషమంగానే ఉందని వైద్యులు తెలిపారు. అన్నదమ్ముల మృతితో కుటుంబలో విషాదం నిండుకుంది.



రోదిస్తున్న కుటుంబ సభ్యులు



మృతి చెందిన సునీల్



హరీశ్ ఇంజాడిని అభినందిస్తున్న స్థానిక ప్రముఖులు

కుక్కె ఆలయ కమిటీ చైర్మన్‌గా హరీశ్ ఇంజాడి

- రౌడీ షీటర్ల జాబితాలో పేరు..
- హిందూ సంఘాల ఆగ్రహం

7



జిల్లా క్రీడా మైదానంలో నిలిచిపోయిన వాన నీరు

నగరం.. జలమయం..!

- బళ్లారిని ముంచెత్తిన వాన
- జలమయమైన రహదారులు

8లో

పని చేసే చోటే ప్రాణం విడిచింది..

- అస్వస్థతతో ఉపాధి కూలీ మృత్యువాత

రాయచూరు, మే 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని లింగసుగూరు తాలూకా చిక్కనగనూరు గ్రామానికి చెందిన మహిళా కూలి మృత్యువాత పడింది. మంగళవారం గ్రామ సమీపంలో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పనుల కోసం వెల్లిన సుకన్యా మహావీర్ సింగ్(50) అనే మహిళ పనులు చేస్తు అస్వస్థతతో కుప్పకూలి అక్కడికక్కడే మృత్యువాత పడింది. విషయం తెలుసుకున్న పంచాయతీ అధికారులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలిం చారు. తీవ్ర ఎండల కారణంగానే మృతి చెందినట్లు భావిస్తున్నారు. కాగా టీయూసీఐ నాయకులు బాధిత మహిళ కుటుం బానికి ప్రభుత్వం అండగా నిలవాలని కోరారు. నిరుపేద కుటుంబానికి చెందిన సుకన్యా జీవనోపాధి కోసం కూలి పనులు చేస్తు మృతి చెందడం విచారకరమని ఆమె కుటుంబానికి ప్రభుత్వం ఆర్థికంగా చేయుతనిచ్చి ఆదుకోవాలని కోరారు.



సుకన్యా సింగ్(ఫైల్)

బంగారు బిడ్డలు..!

జేఎన్‌టీయూలో బీటెక్ విద్యార్థులకు బంగారు పతకాలు

ఆరు పతకాలతో అదరగొట్టిన పూజిత్‌కుమార్ రెడ్డి

17న రాష్ట్ర గవర్నర్ నుంచి అందుకోనున్న విద్యార్థులు



అనంతపురం సెంట్రల్, మే 13(ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల బీటెక్ విద్యార్థులు బంగారు పతకాలు సాధించారు. 17న నిర్వహిస్తున్న స్నాతకోత్సవంలో రాష్ట్ర గవర్నర్ జస్టిస్ సయ్యద్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా వీటిని అందుకోనున్నారు. 2024-25 సంవత్సరానికి బీటెక్ టాపర్స్‌గా ఏడుగురు విద్యార్థులు నిలిచారు. అందులో ఐదుగురు బాలికలు బంగారు పతకాలను సాధించడం గమనార్హం. మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థి నంద్యాల పూజిత్ కుమార్ రెడ్డి ఏకంగా ఆరు బంగారు పతకాలు సాధించారు. జేఎన్టీయూ పులివెందుల కళాశాల నుంచి ఐదుగురు విద్యార్థులు పతకాలకు ఎంపికయ్యారు. వర్సిటీ అనుబంధ ప్రైవేట్ కళాశాలల నుంచి 12మంది బంగారు పతకాలు అందుకోనున్నారు. వర్సిటీ వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ క్రిష్ణయ్య, డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ ప్రొఫెసర్ నాగప్రసాద్ నాయుడు విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు.

అనంతపురం ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థుల మెడల్స్ వివరాలు..

విద్యార్థి	బ్రాంచ్	సీజీపీఏ	మెడల్స్
నంద్యాల పూజిత్ కుమార్ రెడ్డి	మెకానికల్ ఇంజనీరింగ్	87.73	6
సుప్రియ	కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్	87.62	4
గువ్వల వాల్మీకి హరిత	సివిల్ ఇంజనీరింగ్	86.48	3
పటాన్ ఫహద్ అలి	ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్	85.51	3
శ్రీ వైష్ణవి	ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్	84.14	2
జాహ్నవి	కెమికల్ ఇంజనీరింగ్	84.78	2
పి.వనతి	మెకానికల్ ఇంజనీరింగ్	87.73	1

ప్రభుత్వ రంగ ఉద్యోగిగా..



ప్రభుత్వ రంగంలో ఉన్నతస్థాయి ఉద్యోగిగా పేదలకు సేవలందించాలన్నది అమ్మ, నాన్న ఆకాంక్ష. వారి కలలు నెరవేర్చేలా ఏపీపీఎస్సీ, ఎస్ఎస్సీ వంటి పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నా. మాది నెల్లూరు నగరం. అమ్మ నాగలక్ష్మి ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్నారు. నాన్న కరుణానిధి ప్రైవేటు ఉద్యోగి. విద్యార్థులను ప్రోత్సహించేలా కళాశాల అధికారులు ప్రణాళిక బద్ధంగా సెమినార్స్ ప్రాజెక్టులు నిర్వహించి నైపుణ్యాలను వెలికితీస్తున్నారు.

-శ్రీ వైష్ణవి, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, రెండు గోల్డ్ మెడల్స్

ఉన్నత ఉద్యోగమే లక్ష్యం



ప్రభుత్వ రంగ సంస్థ(పీఎస్‌యూ)లో అత్యున్నత స్థాయి ఉద్యోగం సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నా. మాది కడప జిల్లా యర్రగుంట్ల. అమ్మ మంజుల గృహిణి. నాన్న బ్రహ్మంరెడ్డి ప్రైవేట్ కంపెనీలో రోజుకూలీగా పని చేస్తారు. గత డిసెంబరులో కళాశాలలో క్యాంపస్ ప్లేస్‌మెంట్ నిర్వహించారు. ఇంటర్వ్యూలో ప్రతిభ కనబర్చడంతో ఉద్యోగానికి ఎంపికయ్యా. రూ.6లక్షల వార్షిక వేతనంతో ఎల్అండ్‌టీ కంపెనీలో ట్రైనీ ఇంజనీర్‌గా పని చేస్తున్నా.

- నంద్యాల పూజిత్ కుమార్ రెడ్డి, మెకానికల్ ఇంజనీరింగ్, ఆరు గోల్డ్ మెడల్స్

సాఫ్ట్‌వేర్ మేనేజర్‌గా..



గూగుల్ వంటి సంస్థల్లో అంతర్జాతీయ స్థాయిలో సాఫ్ట్‌వేర్ మేనేజర్‌గా పని చేయాలన్న ప్రణాళిక పెట్టుకున్నా. మాది చిత్తూరు జిల్లా, ఐరాల మండలం, బీఎస్ అగ్రహారం. అమ్మ ఉషారాణి, నాన్న శ్రీనివాస్ ఇద్దరూ కిరాణాకొట్టు నిర్వహిస్తున్నారు. వారి ఆశలు నెరవేర్చేలా బీటెక్‌లో మంచి సీజీపీఏను సాధించా. కళాశాలలోని మా విభాగాధిపతి డాక్టర్ కేఎఫ్ భారతి ప్రోత్సాహం మరువలేనిది. రూ.6లక్షల వార్షిక వేతనంతో బెంగళూరులోని డెలాయిట్ కంపెనీలో అనలిస్టుగా పనిచేస్తున్నా.

- తయ్యూరు సుప్రజ, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్, నాలుగు గోల్డ్ మెడల్స్

గ్రూప్స్‌కు ప్రిపేర్ అవుతున్నా



ఆంధ్రా యూనివర్సిటీలో ఎంటెక్ చదువుతూ.. ఏపీపీఎస్సీ గ్రూప్స్, ఎస్ఎస్సీ జేఈ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నా. మాది అనంతపురం. అమ్మ గౌరి గృహిణి. నాన్న కృష్ణ ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. బీటెక్ ప్రథమ సంవత్సరం తోటి విద్యార్థుల్లాగే సాధారణ సీజీపీఏ వచ్చింది. అయితే మా విభాగాధిపతి అజిత ప్రోత్సాహంతో చివరి సంవత్సరం వచ్చేసరికి 86.48 తగ్గకుండా మెరిట్‌లో పాస్ అవుతూ వచ్చా. కళాశాలకు ఎంతో రుణపడివుంటా.

- గువ్వల వాల్మీకి హరిత, సివిల్ ఇంజనీరింగ్, మూడు గోల్డ్ మెడల్స్.

ఐఈఎస్‌లో ర్యాంకే లక్ష్యం



ఐఏఎస్, ఐపీఎస్ తరహాలో ఇండియన్ ఇంజనీరింగ్ సర్వీసెస్(ఐఈఎస్)లో ర్యాంక్ సాధించాలని లక్ష్యాన్ని పెట్టుకున్నా. మాది కదిరి పట్టణం. అమ్మ ముంతాజ్, గృహిణి. నాన్న మహబాషా టైలర్‌గా పని చేస్తున్నారు. మహారాష్ట్ర పూణేలోని టీసీఎస్‌లో పని చేస్తున్నా. కళాశాలలో అనుభవం కల్గిన ఫ్యాకల్టీ బోధనతో విద్యార్థులు సులువుగా మెరిట్‌ను సాధిస్తున్నారు. ప్రైవేట్ సంస్థలతో ఎంఓయూలు చేసుకుని క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ ద్వారా మాలాంటి విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారు.

- పటాన్ పహద్ అలి, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, మూడు గోల్డ్‌మెడల్స్

నేటి నుంచి దుర్గాంబ జాతర

ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు



మూలవిరాట్ నసనకోట దుర్గాంబ

రామగిరి, మే 13(ఆంధ్రజ్యోతి): మండలంలో నసపకోట సమీపంలో వెలసిన దుర్గాంబ జాతరకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. 64 సంవత్సరాల తర్వాత జాతర నిర్వహిస్తుండటంతో పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నారు. బుధవారం నుంచి 18వతేదీ వరకు జాతరను నిర్వహించనున్నారు. ఈ జాతర రాప్తాడు ఎమ్మెల్యే పరిటాలసునీత, పరిటాలశ్రీరామ్ ఆధ్వర్యంలో నసనకోట, వెంకటాపురం, గంగంపల్లి గ్రామాల ప్రజల సహకారంతో నిర్వహించనున్నారు. దాదాపు రూ.కోటికిపైగా వెచ్చించి ఇక్కడ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. అమ్మవారి ఉత్సవాలను తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో రానున్నారు. బుధవారం హరియాన్ చెరువు నుంచి పాలకావిడి వచ్చే కార్యక్రమం నిర్వహిస్తారు. అదే రోజు దుర్గాంబ, ముత్యాలమ్మ గ్రామ దేవతలకు దుర్గాంబ చెలిమలో గంగపూజ నిర్వహిస్తారు. 15న ఉత్సవ విగ్రహాలను మూడు గ్రామాలలో ఊరేగించనున్నారు. 16న అభయాంజనేయస్వామి విగ్రహ పునఃప్రతిష్ఠ జరుగుతుంది. 17న దుర్గాంబమ్మకు ముత్తవకుంట్ల గ్రామం సరిపూటి వారు అఖండ జ్యోతిని సమర్పిస్తారు. సాయంత్రం మూడు గ్రామాల నుంచి జ్యోతులతో వచ్చి అమ్మవారికి సమర్పిస్తారు. అదే రోజు రాత్రి కురుబ బెల్లంవారు వండిన బోనాన్ని బళ్లారి వారు తీసుకుని పెద్దమాదిగలు అందరు కలిసి ఊరేగింపుగా గుడి ప్రాంగణానికి చేరుకుంటారు. ఆదివారం అమ్మవారికి పెద్దఎత్తున జ్యోతులు, బోనాలు సమర్పించి కార్యక్రమాలు ముగిస్తారు. ఈ ఐదు రోజుల పాటు అక్కడ హోమాలు, యజ్ఞాలు కూడా నిర్వహించనున్నారు. దుర్గాంబ జాతర చరిత్రలో నిలిచిపోయేలా నిర్వహించేందుకు పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్, గ్రామస్థులు కృషి చేస్తున్నారు.



గుండుకింద వెలసిన దేవాలయం



ప్రతిష్ఠించనున్న అభయాంజనేయ స్వామి విగ్రహం

సొంతూరిలోనే పరిశ్రమ పెట్టండి

- పుట్టిన ప్రాంత అభివృద్ధిలో భాగస్వాములవ్వండి
- మంత్రి సవిత పిలుపు
- పెనుకొండ వద్ద ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటుకు భూమిపూజ



ఎంఎస్ఎంఈ పార్కుకు భూమిపూజ చేస్తున్న మంత్రి సవిత

పెనుకొండ రూరల్, మే 13(ఆంధ్రజ్యోతి): ఎక్కడెక్కడో పరిశ్రమలు ఏర్పాటు చేసే బదులు.. సొంతూరులోనే పెట్టాలని ఔత్సాహికులు, యువతకు బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి సవిత పిలుపునిచ్చారు. పుట్టిన ప్రాంత అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. పెనుకొండ సమీపంలోని రొద్దం ప్లేట్లపై 59.37 ఎకరాల్లో ఏర్పాటు చేస్తున్న సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) పార్కుకు మంత్రి మంగళవారం భూమిపూజ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ఎంఎస్ఎంఈ పార్కులో తొలి విడత 20 ఎకరాల్లో చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. 115 పరిశ్రమలకు ఏడు సెంట్ల చొప్పున భూమి కేటాయిస్తున్నామ న్నారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అన్ని ప్రాంతాల్లో పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం పారిశ్రామికరంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసిందన్నారు. రాష్ట్రానికి పరిశ్రమలు రాకుండా అడ్డుకోవడంతోపాటు ఉన్నవాటిని కూడా ఇక్కడి నుంచి వెళ్లిపోయేలా చేసిందన్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యాక పరిశ్రమల ఏర్పాటుకు పారిశ్రామిక వేత్తలు ముందుకు వస్తున్నారని మంత్రి వివరించారు. కార్యక్రమంలో ఆర్డీఓ ఆనంద్‌కుమార్, ఏపీఐఐసీ జెడ్ఎం సుహానాసోనీ, తహసీల్దార్ శ్రీధర్, పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

ఇంటికొక పారిశ్రామికవేత్త తయారుకావాలి

- ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి



ఎంఎస్ఎంఈ పార్కు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్ తదితరులు

పుట్టపర్తిరూరల్, మే 13(ఆంధ్రజ్యోతి): ఇంటికొక పారిశ్రామిక వేత్త తయారుకావాలని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి పిలుపునిచ్చారు. జిల్లాకేంద్రం పరిధి కప్పలబండ సమీపాన ఏపీఐఐసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) పార్కును కలెక్టర్ టీఎస్ చేతన్, మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డితో కలిసి ఎమ్మెల్యే మంగళవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 104 ఎకరాల విస్తీర్ణంలో ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు చేశామన్నారు. ఇందులో రూ.154 కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. రాష్ట్రంలోనే రోల్ మోడల్‌గా పారిశ్రామికవాడను తీర్చిదిద్దుతామన్నారు. మాజీ మంత్రి పల్లె మాట్లాడుతూ.. టీడీపీ హయాంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ముందుచూపుతో కప్పలబండలో 104 ఎకరాలను సేకరించి, పారిశ్రామికవాడ ఏర్పాటు చేసి, యువతకు ఉపాధి అవకాశాలను కల్పించాలని నిర్ణయించారన్నారు. తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ నాశనం చేసిందన్నారు.

ప్రస్తుతం కూటమి అధికారంలోకి రావడంతో ఈ ప్రాంత అభివృద్ధికి అడుగులు పడుతున్నాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చిన్నపెద్దన్న, ఆర్డీఓ సువర్ణ, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సోనీ, ఎంపీపీ రమణారెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కాక పుట్టిస్తున్న కొత్త రూల్స్..!

పాఠశాలల పునర్వ్యవస్థీకరణ, టీచర్ల పునర్విభజనకు శ్రీకారం

- జీవోలు 19, 20, 21 విడుదల చేసిన విద్యాశాఖ
- 96 యూపీ స్కూళ్లు హైస్కూళ్లుగా అప్‌గ్రేడ్
- 554 ఎస్ఏ పోస్టులు పీఎస్ హెచ్ఎంలుగా కన్వర్షన్
- ఉమ్మడి జిల్లాకు కొత్తగా 437 క్రియేషన్ పోస్టులు
- ఉపాధ్యాయ సంఘాల నేతల నుంచి విమర్శలు
- డీఈఓకు నేతల నుంచి వినతుల వెల్లువ





డీఈఓకు ప్రైమరీ స్కూల్ హెచ్ఎం యూనియన్ నేతల వినతి, స్కూళ్లు, పోస్టుల వివరాలు ప్రకటించాలని పీఆర్టీయూ నేతల వినతి

అనంతపురం విద్య, మే 13(ఆంధ్రజ్యోతి): పాఠశాలల పునర్వ్యవస్థీకరణ, టీచర్ల పునర్విభజన ఉత్తర్వులు ఉపాధ్యాయులు, సంఘాల నేతల్లో కాక పుట్టిస్తున్నాయి. ప్రభుత్వం మంగళవారం జారీ చేసిన జీవోలు 19, 20, 21, ఉపాధ్యాయులకు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. మెజార్టీ ఉపాధ్యాయులు, సంఘాల నేతల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 554 స్కూల్ అసిస్టెంట్ పోస్టులను మోడల్ ప్రైమరీ హెచ్ఎంలుగా/స్కూల్ అసిస్టెంట్స్‌గా కన్వర్షన్ చేశారు. కొత్తగా జిల్లాకు 437 పోస్టులను సర్దుబాటు చేయనున్నారు. అదే విధంగా 96 అప్పర్ ప్రైమరీ స్కూళ్లను హైస్కూళ్లుగా అప్‌గ్రేడ్ చేశారు. ఈ మేరకు విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కోన శశిధర్ జీవోలు జారీ చేశారు.

96 స్కూళ్లు అప్‌గ్రేడ్

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 96 అప్పర్ ప్రైమరీ స్కూళ్లను ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేశారు. హిందూపురం మండలంలో 10, రాయదుర్గంలో 9, అనంతపురం మండలంలో 8 పాఠశాలలు, తాడిపత్రిలో 6, విడపనకల్లు, కదిరిలో 5 చొప్పున, బ్రహ్మసముద్రం, డి.హీరేహాళ్, గుమ్మఘట్ట, ఉరవకొండ మండలంలో 4 చొప్పున, కణేకల్లు, మడకశిర, బుక్కపట్నం మండలాలలో 3 చొప్పున, బెళుగుప్ప, బొమ్మనహాళ్, బుక్కరాయసముద్రం, కళ్యాణదుర్గం, కూడేరు, లేపాక్షి, పెనుకొండ, గుత్తి మండలాలలో రెండు చొప్పున, ఆత్మకూరు, చిలమత్తూరు, ధర్మవరం, గాండ్లపెంట, గోరంట్ల, గుంతకల్లు, ఓడీసీ, పామిడి, రొద్దం, శెట్టూరు, వజ్రకరూరులో ఒక్కొక్క పాఠశాలను ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేశారు.

స్కూల్ అసిస్టెంట్ పోస్టుల కన్వర్షన్

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వందలాది స్కూల్ అసిస్టెంట్ పోస్టులను మోడల్ ప్రైమరీ హెచ్ఎంలుగా/స్కూల్ అసిస్టెంట్స్‌గా కన్వర్షన్ చేశారు. మొత్తంగా 554 పోస్టులను కన్వర్షన్ చేశారు. ఇందులో ఎస్ఏ పోస్టులు 520 కాగా, మరో 34 స్కూల్ అసిస్టెంట్ తత్సమానమైన పోస్టులు ఉన్నాయి. స్కూల్ అస్టింట్ పోస్టులు 520లో జడ్పీ, మండల పరిషత్‌లో 515, ప్రభుత్వ పాఠశాలల్లో 5 పోస్టులను కన్వర్షన్ చేశారు. 34 స్కూల్ అసిస్టెంట్ తత్సమానమైన పోస్టుల్లో జడ్పీ, ఎంపీపీ స్కూళ్ల నుంచి 31 పోస్టులు, గవర్నమెంట్ నుంచి 3 పోస్టులను కన్వషన్ చేశారు. స్కూల్ అసిస్టెంట్ పోస్టులను మోడల్ ప్రైమరీ లేదా స్కూల్ అసిస్టెంట్లుగా కన్వర్షన్ ఇవ్వడంపై మెజార్టీ టీచర్లు, సంఘాల నేతల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. యూపీ స్కూళ్లలోని సబ్జెక్టు టీచర్లను తీసుకెళ్లి ప్రైమరీలో బోధన చేయించడం ఏమిటని మండిపడుతున్నారు.

కొత్తగా 437 పోస్టుల సర్దుబాటు

ఉమ్మడి జిల్లాకు కొత్తగా 437 పోస్టులను సర్దుబాటు చేయనున్నారు. క్రియేషన్ కమ్ డైరెక్టర్ (హెచ్ఓడీ) పూల్ నుంచి జిల్లాకు 437 పోస్టులను ఇవ్వనున్నారు. ఇందులో 78 హెచ్ఎం పోస్టులు ఉన్నాయి. అందులో ఎంపీపీ స్కూళ్లలో 54, మున్సిపల్ కార్పొరేషన్ స్కూళ్లలో 5, మున్సిపాలిటీల్లో 19 పోస్టులు ఇవ్వనున్నారు. స్కూల్ అసిస్టెంట్లు 359 పోస్టులు సర్దుబాటు చేయనుండగా, అందులో ఎంపీపీ స్కూళ్లలో 93, గవర్నమెంట్‌లో 6, మున్సిపాల్ కార్పొరేషన్‌లో47 పోస్టులు, మున్సిపాలిటీల్లో 213 పోస్టులు సర్దుబాటు చేయనున్నారు. విద్యాశాఖాధికారుల సమాచారం మేరకు డైరెక్టర్ పూల్ ద్వారా ఇతర జిల్లాల నుంచి మన జిల్లాకు కొత్తగా 437 పోస్టులను సర్దుబాటు చేస్తారని స్పష్టమవుతోంది.

కొత్త రూల్స్‌పై విమర్శలు

కొత్త ఉత్తర్వులపై ఉపాధ్యాయ సంఘాల నేతలు, టీచర్ల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పలు సంఘాల నేతలు డీఈఓను వేర్వేరుగా కలసి అభ్యంతరం తెలిపారు. ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయుల సంఘం నాయకులు డీఈఓను కలిశారు. ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శులు రమణ, మర్రిస్వామి, జిల్లా అధ్యక్షులు నారాయణస్వామి, జిల్లా ప్రధానకార్యదర్శి రమణ ప్రసాద్ మాట్లాడుతూ, ప్రస్తుతం పనిచేస్తున్న పీఎస్ హెచ్ఎంలకు బదిలీల్లో స్థానాలు కేటాయించిన తర్వాతనే స్కూల్ అసిస్టెంట్స్‌కు పీఎస్ హెచ్ఎంలుగా కన్వర్షన్ ఇవ్వాలని అన్నారు. గత బదిలీల్లో రేషనలైజేషన్ కారణంగా 8 ఏళ్లలోపే బదిలీ అయ్యి, త్వరలో జరిగే బదిలీల్లో రేషనలైజేషన్‌కు గురయ్యే ప్రైమరీ హెచ్ఎంలకు పాత స్టేషన్ పాయింటు కేటాయించాలని కోరారు. ఈ మేరకు డీఈఓకు వినతిపత్రం అందించారు. పీఆర్టీయూ రాష్ట్ర కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీసత్యసాయి జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి డీఈఓను కలసి , బదిలీల్లో అసంబద్ధ అంశాలను పరిష్కరించాలని కోరారు. సీనియారిటీ జాబితాలు, దివ్యాంగుల ధ్రువీకరణ పత్రాల వివరాలు, గతంలో ప్రిఫరెన్షియల్ కేటగిరీ ఉపయోగించుకున్న వారి వివరాలను, సర్దుబాటు ప్రక్రియలో ఎఫెక్ట్ అయిన టీచర్ల వివరాలు, కొత్తగా అప్‌గ్రేడ్ అయ్యే స్కూళ్లు, పోస్టుల వివరాలు ప్రకటించాలని కోరారు. ఈ మేరకు డీఈఓకు వినతిపత్రం అందించారు.

దంచికొట్టిన వాన

పొంగిన వాగులు, వంకలు
పలుచోట్ల పంట నష్టం



ఉధృతంగా పారుతున్న చెన్నేకొత్తపల్లి మండలం పెద్దమొగలాయపల్లి వంక

ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్, మే 13(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో సోమవారం అర్ధ రాత్రి తర్వాత వాన దంచికొట్టింది. వాగులు, వంకలు పొంగిపొర్లాయి. చెక్‌డ్యాంలు నిండిపోయాయి. పలు చెరువుల్లోకి నీరు చేరింది. విపరీతమైన ఎండ, ఉక్కపోతతో విలవిల్లాడుతున్న జనం.. వర్షం రాకతో ఉపశమనం పొందారు. భూగర్భ జల మట్టం పెరుగుతుందని అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పలుచోట్ల ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లింది. కొత్తచెరువు మండలంలోని వేములేటిపల్లి వద్దనున్న చెక్ డ్యాం పొంగిపొర్లింది. చెన్నేకొత్తపల్లి మండలంలోని పెద్దమొగలాయపల్లి, ప్యాదిండితోపాటు పలు చిన్నచిన్న వంకలు కూడా ప్రవహించాయి. నాగసముద్రం, మేడాపురం తదితర చెరువుల్లోకి కొంతమేర నీరు చేరింది. రామగిరి చెరువులోకి నీరు చేరింది.

పిడుగు పడి పేలిన ఇన్వర్టర్

విడపనకల్లు మండలంలోని ఆర్ కొట్టాల గ్రామంలోని రామాలయం లోగల ఓ గది పక్కనే ఉన్నవేప చెట్టుపై పిడుగు పడింది. చెట్టుకు ఆనుకుని ఉన్న గదిలోని ఇన్వర్టర్ పేలి పోయింది. ఇంట్లోని స్విచ్ బోర్డులు పేలిపోయాయి. టీవీ, ఫ్రిజ్ కాలిపోయాయి. విద్యుత్ సరఫరా ఆగి పోయింది.

ఏడెకరాల్లో బొప్పాయి పంటనష్టం

ఈదురుగాలులతో కూడిన వర్షానికి గుమ్మఘట్ట మండలం గలగల గ్రామ రైతులు సోమలింగ, రమేష్‌కు చెందిన ఏడెకరాల్లో బొప్పాయి పంట దెబ్బతింది. దీంతో రూ.10 లక్షల దాకా నష్టం వాటిలినట్లు ఉద్యాన శాఖ అధికారులు అంచనా వేశారు.

వర్షపాతం నమోదు ఇలా..

ఉమ్మడి జిల్లాలోని పలు మండలాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం పడింది. కొత్తచెరువు 77.6, చెన్నేకొత్తపల్లి 74.6, రాప్తాడు 66.4, గుత్తి 61.4, బుక్కపట్నం 59.4, యాడికి 50.0, కంబదూరు 40.4, పుట్టపర్తి 36.2, ధర్మవరం 34.6, నల్లమాడ 24.0, రామగిరి 23.6, శెట్టూరు 22.6, కుందుర్పి 20.6, కదిరి, కనగానపల్లి 15.2, పరిగి 11.6, బుక్కరాయసముద్రం 11.2, అగళి 10.2, విడపనకల్లు 8.8, తలుపుల, రొళ్ల 7.4, ముదిగుబ్బ 6.8, ఓబుళదేవరచెరువు 6.4, నార్పల 6.2, గుమ్మఘట్ట 4.8, గుంతకల్లు, బ్రహ్మసముద్రం, కూడేరు 4.2, బొమ్మనహాళ్ 3.4, పెనుకొండ 2.6, అనంతపురం, బత్తలపల్లి, తాడిమర్రిలో 1.2 మి.మీ వర్షపాతం నమోదైంది.



కొత్తచెరువు మండలం వేములేటిపల్లి వద్ద పొంగిపొర్లుతున్న చెక్ డ్యాం



గుమ్మఘట్ట మండలం గలగల గ్రామంలో దెబ్బతిన్న బొప్పాయి పంటను చూపుతున్న రైతు సోమలింగ



పేలిన ఇన్వర్టర్

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కౌంప్...

మృణాల్ సేన్ (జయంతి)



'పద్మభూషణ్' గ్రహీత మృణాళ్ సేన్ 1923 మే 14న అవిభాజ్య భారతదేశంలో, ప్రస్తుత బంగ్లాదేశ్‌లోని ఫరీద్‌పూర్‌లో జన్మించారు. భారతీయ సినీ దర్శకుడు. సమకాలీకులైన సత్యజిత్ రే, రిత్విక్ ఘటక్‌లతో కలసి సినీరంగంలో కొత్త ఒరవడి సృష్టించారు. దర్శకుడిగా తొలి చిత్రం 'రాత్ భోరేని' 1955లో రూపొందించారు. సినిమా ద్వారా సామాజిక వాస్తవాన్ని వ్యాఖ్యానించడం, కళాత్మకంగా ప్రతిబింబించడం వంటివాటికి ఆయన పేరొందారు. 1983, 1997లలో అంతర్జాతీయ చలనచిత్రోత్సవాలకు జ్యూరీ సభ్యుడిగా వ్యవహరించారు. 2017లో ఆస్కార్ అకాడమీ సభ్యుడిగా వ్యవహరించారు. 18 నేషనల్ ఫిల్మ్ అవార్డులు, దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు అందుకున్నారు. 2018 డిసెంబరు 30న కన్నుమూశారు.

మార్క్ జుకర్‌బర్గ్ (పుట్టినరోజు)



సోషల్ మీడియా దిగ్గజమైన 'ఫేస్‌బుక్' (మెటా ప్లాట్‌ఫాం) సృష్టికర్తగా సుపరిచితులైన మార్క్ ఎలియట్ జుకర్‌బర్గ్ 1984 మే 14న న్యూయార్క్‌లో జన్మించారు. కంప్యూటర్ ప్రోగ్రామర్, ప్రస్తుతం ఫేస్‌బుక్‌కు సీఈగా వ్యవహరిస్తూ ప్రపంచవ్యాప్తంగా టాప్ 100 ప్రభావితులలో ఒకరిగా పేరొందారు. కొవిడ్ క్లిష్టంలో 25 మిలియన్ డాలర్లను బిల్‌గేట్స్ ఫౌండేషన్‌కు విరాళంగా ఇచ్చారు. ధనవంతుడైనా దాతృత్వంలో మిన్న అనిపించుకుని శెహబాష్ అనిపించుకున్నారు. మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్‌లోనూ తర్ఫీదు పొందారు.

మానుషి చిల్లర్ (పుట్టినరోజు)



'మిస్ వరల్డ్' 2017 విజేత మానుషి చిల్లర్ 1997 మే 14న హరియాణ రాష్ట్రం రోహటక్‌లో జన్మించారు. దేశం తరఫున 'ప్రపంచ సుందరి' కిరీటం పొందిన ఆరో యువతి. రాజా, రాధారెడ్డిల నేతృత్వంలో కూచిపూడి నృత్యంలో తర్ఫీదు పొందారు. 'ప్రాజెక్ట్ శక్తి'లో భాగంగా మహిళల నెలసరి సమస్యలపై అవగాహన కల్పించే కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. సీఎన్ఎన్-ఐబీఎన్‌చే ఇండియన్ ఆఫ్ ది ఇయర్ 2017 పురస్కారం అందుకున్నారు. ప్రముఖ సంస్థల ఉత్పత్తులకు రాయబారిగా వ్యవహరిస్తున్నారు. యునిసెఫ్ నిర్వహించే చైతన్య కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.

హెల్త్ సిబ్బంది పేరుతో మోసగించే యత్నం

ఇంటి యజమాని అప్రమత్తతతో పరారైన దుండగులు



తనకల్లు, మే 13(ఆంధ్రజ్యోతి): సర్వే పేరుతో ఓ వ్యక్తిని బురిడీ కొట్టించడానికి ప్రయత్నించిన ఉదంతం తనకల్లులో రెండు రోజుల కిందట జరిగింది. స్థానిక స్టేట్ బ్యాంక్ వీధిలో నివాసం ఉండే వెంకటరమణ ఇంటి వద్దకు ఇద్దరు యువకులు వెళ్లారు. తాము బెంగళూరు నుంచి వచ్చామని, హెల్త్ సూపర్‌వైజర్లమని చెప్పారు. ఆరోగ్య విషయంగా ఓ సర్వే చేస్తున్నామని చెప్పారు. మీ ఇంటి యజమాని ఆధార్ కార్డు, బియ్యంకార్డు, పాన్‌కార్డు, బ్యాంక్ ఖాతా నంబరు ఇవ్వాలని అడిగారు. అనుమానంతో అప్రమత్తమైన ఇంటి యజమాని ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న ఎంపీహెచ్‌ఈఓ ఓబులేసుకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. ఆయన ఈ విషయాన్ని డాక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఎలాంటి సర్వే జరగడం లేదని, వెంటనే సర్వేకు వచ్చిన వారిని ఫొటో తీయమని సూచించారు. దీంతో ఇంటి యజమానికి ఫొటో తీసే ప్రయత్నం చేస్తుండగా, ఆ యువకులు ద్విచక్రవాహనంలో పరారయ్యారు. ఎంపీహెచ్‌ఈఓ ఈవిషయాన్ని తనకల్లు పోలీసులకు సమాచారం అందించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: గోపి, ఎస్ఐ

మండల ప్రజలు అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ గోపి తెలిపారు. ఆయన మాట్లాడుతూ తనకల్లులో రెండురోజుల కిందట కొత్త వ్యక్తులు హెల్త్ సిబ్బంది పేరుతో మోసగించేందుకు యత్నించారన్నారు. ఇంటి యజమాని అప్రమత్తంగా ఉండటంతో వారు పరారైనట్లు చెప్పారు. అపరిచితులు ఎవరైనా మీ సమాచారాన్ని అడిగితే సంబంధిత అధికారులతోకానీ, పోలీసులతోకానీ, సమీపంలోని గ్రామ సచివాలయ సిబ్బందితోకానీ ధ్రువీకరించుకోవాలన్నారు. కొత్తవారు ఎవరైనా ఏ సమాచారం కోసం ప్రయత్నించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

సత్యసాయి ప్రేమతత్వం.. అనన్యం..

పుట్టపర్తి, మే 13(ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా పంచిన ప్రేమతత్వం అనన్యమని మలేసియా ప్రతినిధి పువనేశ్వరినారాయణస్వామి కొనియాడారు. స్థానిక ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభా మండపంలో బుద్ధపూర్ణిమ వేడుకలు రెండోరోజు మంగళవారం కొనసాగాయి. విద్యార్థుల వేదపఠనంతో వేడుకలు ప్రారంభమయ్యాయి. సత్యసాయి ప్రేమతత్వంపై బౌద్ధులు.. భక్తిగీతాలు ఆలపించారు. అనంతరం మలేసియా ప్రతినిధి పువనేశ్వరినారాయణస్వామి మాట్లాడుతూ... సత్యసాయి బోధించిన సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, అహింస.. భక్తులకు పరమావధిగా మారాయన్నారు. సత్యసాయి చూపిన మార్గంలో పయనిస్తూ సేవా కార్యక్రమాలను కొనసాగించాలన్నారు. సాయంత్రం నేపాల్, శ్రీలంక భక్తులు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. వేడుకల్లో శ్రీలంక, జపాన్, సింగపూర్, నేపాల్, ఇండోనేసియా, మయన్మార్, తైవాన్ దేశాల భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా మారియమ్మ కరగ మహోత్సవం



మారియమ్మదేవికి అలంకరణ



కరగధారి ఇలా...



ఆలయం వద్ద వందలాదిమంది భక్తుల సందోహం

దొడ్డబళ్ళాపుర, మే 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వన్నిగరపేటలో కొలువైన సప్తమాతృకా మారియమ్మ ఆలయ కరగ మహోత్సవం సోమవారం రాత్రి వైభవంగా జరిగింది. సప్త మాతృకా మారియమ్మ సేవాభివృద్ధి, వహ్నికుల క్షత్రియ తిగళ సంఘం నేతృత్వంలో కార్యక్రమాలు కొనసాగాయి. కుప్పంకు చెందిన పూజారి మునిరత్నం బాలాజి కరగను ధరించి ధార్మిక విధివిధానాలు పాటించారు. కరగను ధరించి వేలాదిమంది భక్తుల నడుమ నృత్యం చేస్తూ ముందుకు సాగారు. పట్టణంలోని గగనార్యస్వామి మఠం నుంచి పాత బస్టాండ్, నెలదాంజనేయస్వామి దేవాలయం, ఏళుసుత్తిన కోటె, తూబగెరె పేటె, వన్నిగరపేట సహా తదితర ప్రాంతాలలో ఊరేగింపు కొనసాగింది. ఉత్సవం నేపథ్యంలో ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. 14 సంవత్సరాలుగా చిక్కబళ్ళాపుర, బాగేపల్లి సహా ఆంధ్రప్రదేశ్, తమిళనాడులలో కరగను కుప్పం పూజారి మునిరత్నం బాలాజి మోస్తున్నారు. ప్రస్తుతం దొడ్డబళ్ళాపురలో ఐదోసారి కరగను ధరించారు. జాతరలో భాగంగా పట్టణంలోని పలు ప్రాంతాలలో ప్రసాద వినియోగం చేశారు. ఆలయంలో విశేషగణపతి హోమం, నవగ్రహ హోమం, చండికాహోమం నిర్వహించారు. బుధవారం సాయంత్రం 4 గంటలకు ఒనకె నాట్యం, వసంతోత్సవం జరగనుంది. పట్టణంలోని వివిధ కూడళ్లలో వివిధ కళాబృందాలు నిర్మించిన భారీ విద్యుత్‌కటౌట్ ప్రత్యేక ఆకర్షణగా ఉన్నాయి.

రేపు జీకేవీకేలో 59వ స్నాతకోత్సవం



మీడియాతో వీసీ ఎస్‌వీ సురేశా తదితరులు

బెంగళూరు, మే 13(ఆంధ్రజ్యోతి): గాంధీ కృషి విజ్ఞానకేంద్రానికి అనుబంధమైన వ్యవసాయ విశ్వవిద్యాలయం 59వ స్నాతకోత్సవం గురువారం డాక్టర్ బాబు రాజేంద్రప్రసాద్ సభాప్రాంగణంలో జరపనున్నట్టు వైస్ చాన్స్‌లర్ డాక్టర్ ఎస్‌వీ సురేశా తెలిపారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ 2023-24 విద్యాసంవత్సరంలో ఉత్తీర్ణులైన 1271 మంది విద్యార్థులకు డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ పట్టాలను ప్రదానం చేస్తున్నామన్నారు. 871మందికి డిగ్రీ, 311మందికి పీజీ, 89మందికి డాక్టరేట్ పట్టాలను ప్రదానం చేస్తున్నామన్నారు. డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీలో 30 బంగారుపతకాలు ప్రదానం చేస్తున్నామని అందులో 13మంది విద్యార్థినులు, ముగ్గురు విద్యార్థులు ఉన్నారన్నారు. పీజీలో 23మంది విద్యార్థినులు, ఐదుగురు విద్యార్థులకు 62 బంగారుపతకాలను ప్రదానం చేస్తున్నామన్నారు. గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్, వ్యవసాయశాఖ మంత్రి చలువరాయస్వామి, ఇఫ్కో మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ యూఎస్ అవస్థిలు ముఖ్యులుగా పాల్గొంటారన్నారు. డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీలో మండ్యకు చెందిన ప్రవల్లిక, జీకేవీకే విద్యార్థిని మారేపల్లి ఉదయ్‌సింధు, స్ఫూర్తి శంకర్‌లకు డాక్టరేట్‌లు ప్రదానం చేస్తున్నామన్నారు. పీజీలో జీకేవీకేకు చెందిన ఆర్తికి 5 బంగారు పతకాలు, మండ్యకు చెందిన హర్షితాకు 3, సుకన్యా రాణిబెన్నూరుకు 3, మేఘనాకు 3, ప్రియాంకకు 2 బంగారు పతకాలు దక్కనున్నాయి. బీఎస్సీ అగ్రికల్చర్ హానర్స్‌లో జీకేవీకే విద్యార్థిని దీప్తి టీఎల్‌కు 13 బంగారు పతకాలు, మండ్యకు చెందిన స్ఫూర్తికి 9, చామరాజనగరకు చెందిన యశిత్‌కు 3, అగ్రికల్చర్ మేనేజిమెంట్‌లో ఐశ్వర్య గణపతిగౌడకు 7, అగ్రి బీటెక్‌లో సాయంతన్ మైథికి 3, బీటెక్ బయోటెక్నాలజీలో రమ్యశ్రీకి 2, బీటెక్ ఫుడ్‌టెక్నాలజీలో సోనుకు 1, పట్టు పరిశ్రమలో చింతామణికి చెందిన గణేశ్‌కు ఒక బంగారు పతకం ఇవ్వనున్నారు. గౌరవ డాక్టరేట్‌ను మాజీ ఐఏఎస్ అధికారి వీ బాలసుబ్రమణ్యం, యోగేంద్రకుమార్‌లకు ప్రదానం చేస్తున్నట్టు తెలిపారు.

ఆర్మీ జవాన్లకు గౌరవ వందనం



ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే నారాయణస్వామి

బంగారుపేట, మే 13(ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్‌పై యుద్ధంలో పోరాటం చేసిన ఆర్మీ జవాన్లకు గౌరవ వందనం సమర్పిస్తున్నట్టు ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణస్వామి పేర్కొన్నారు. తాలూకాలోని ఆలదమర వద్ద డీకే హళ్ళి గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటైన గ్రామసభను ప్రారంభించి మాట్లాడారు. మూడోసారి ఎమ్మెల్యే అయ్యేందుకు డీకేహళ్ళి గ్రామస్తులు పునర్జన్మ కల్పించారన్నారు. నియోజకవర్గ ప్రజలు చాలామంది ఉద్యోగం కోసం బెంగళూరుకు వెళ్తున్నారని, దీన్ని తప్పించేందుకు స్థానికంగా ఉద్యోగావకాశాలు కల్పించేందుకు 700 ఎకరాలలో త్వరలో పారిశ్రామికవాడ ఏర్పాటుకు అనుమతులు మంజూరయ్యాయని త్వరలోనే పనులు ప్రారంభం అవుతాయన్నారు. భరత్‌నగర్‌లో కోటి రూపాయలతో సముదాయభవనం నిర్మిస్తామని, రూ.3కోట్లతో దాసరహొసహళ్ళి చెరువును అభివృద్ధి చేస్తామని, పబ్లిక్ టాయిలెట్ నిర్మిస్తామని, కోలారులోని దింబగేట్ నుంచి కృష్ణావరం వరకు డబుల్ రోడ్డు నిర్మించి వీధిదీపాలు అమర్చనున్నట్టు హామీ ఇచ్చారు. ఈఓ రవికుమార్, గ్రామపంచాయతీ అధ్యక్షుడు సురేశ్, కేజీఎఫ్ నగరాభివృద్ధి ప్రాధికార అధ్యక్షుడు గోపాలరెడ్డి, పీడీఓ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభావంత విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు



మీడియా సమావేశంలో సందీప్‌రెడ్డి తదితరులు

చిక్కబళ్ళాపుర, మే 13(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ సామాజికవర్గానికి చెందిన పదో తరగతి, ద్వితీయ పీయూసీ ఫలితాల్లో 60శాతానికి పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇవ్వనున్నట్టు భగత్‌సింగ్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ సందీప్‌రెడ్డి తెలిపారు. పట్టణంలో మంగళవారం మీడియాతో మాట్లాడుతూ చిక్కబళ్ళాపుర శాసనసభ నియోజకవర్గంలోని చిక్కబళ్ళాపుర, మంచేనహళ్ళి తాలూకాలకు చెందిన విద్యార్థులకు మాత్రమే స్కాలర్‌షిప్‌లు ఇస్తామన్నారు. నగరంలోని తమ కార్యాలయంలో దరఖాస్తు సమర్పించాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలలో చదువుతున్న విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. మీడియా సమావేశంలో తిరుమలప్ప, నారాయణస్వామి, మూర్తి, శివణ్ణ, హరీశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చక్కటి జీవనశైలితోనే రోగాల నియంత్రణ



పరీక్షలు చేయించుకుంటున్న ఏఎస్పీ జగన్నాథ్‌రై

చింతామణి, మే 13(ఆంధ్రజ్యోతి): జీవనశైలిలో చక్కటి ఆహార పద్ధతులు పాటించడం ద్వారానే రోగాల నియంత్రణ సాధ్యమని స్పర్శ్ ఆసుపత్రి డాక్టర్ లోకేశ్ ఎల్‌వీ అభిప్రాయపడ్డారు. నగరసభ ఆవరణలో బెంగళూరు స్పర్శ్ ఆసుపత్రి, చింతామణి నగరసభ, పోలీస్‌శాఖ సంయుక్తంగా మంగళవారం ఏర్పాటైన ఉచిత ఆరోగ్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. గతంలో మనం బియ్యం కంటే రాగి, సిరిధాన్యాలు ఎక్కువగా ఆహారం తీసుకునేవారమన్నారు. బీపీ, క్యాన్సర్, గుండెపోటు, మూత్రపిండాల సమస్యల గురించి వివరించారు. ఆహారంలో సిరిధాన్యాలు ఎక్కువగా తీసుకోవాలన్నారు. నగరసభ పౌర కార్మికులు, పోలీసుశాఖ అధికారులు, సిబ్బందికి పరీక్షలు నిర్వహించారు. చిక్కబళ్ళాపుర జిల్లా ఏఎస్పీ బీ జగన్నాథ్ రై, నగరసభ కమిషనర్ జీఎన్ చలపతి తదితరులు పాల్గొన్నారు.

ధార్మిక కార్యక్రమాలతో మానసిక ప్రశాంతత



ప్రముఖులకు సన్మానం

దొమ్మసంద్ర, మే 13(ఆంధ్రజ్యోతి): ధార్మిక కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా మానసిక ప్రశాంతత సాధ్యమని ధర్మసాగర హైస్కూల్ 1990-93 పూర్వ విద్యార్థుల ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్టీ అధ్యక్షుడు ఎస్ కేశవ్ బాబురెడ్డి అభిప్రాయపడ్డారు. సరిహద్దులోని డెంకణీకోట తాలూకా గుమ్మళాపుర గ్రామంలో ని కూర్మారూఢ ముక్తి గణపతి నూతన దేవాలయ అష్టబంధన, మహాకుంభాభిషేకం మహోత్సవంలో పాల్గొన్నారు. వైశాఖ పూర్ణిమన హోమం, పూర్ణాహుతి తదితర కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో జరిగాయి. తళి ఎమ్మెల్యే టీ రామచంద్రన్, హోసూరు ఎమ్మెల్యే ప్రకాశ్, దొమ్మసంద్ర గ్రామపంచాయతీ మాజీ ఉపాధ్యక్షుడు డాక్టర్ డీవీ ధనరాజు, అంబుజ దంపతులు తదితరులు పాల్గొన్నారు.

నేరపరిశోధనలో ఫోరెన్సిక్ ఆధారాలే కీలకం : ఎస్పీ



ఫోరెన్సిక్ అధికారులను సన్మానిస్తున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి రూరల్, మే 13(ఆంధ్రజ్యోతి): సాంకేతికత ఊపందుకున్న ప్రస్తుత తరుణంలో నేరపరిశోధన, కేసుల దర్యాప్తులో ఫోరెన్సిక్ ఆధారాలు ఎంతో కీలకమని జిల్లా ఎస్పీ రత్న పేర్కొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం ఫోరెన్సిక్ సైన్సు ఎవిడెన్సు మేనేజ్‌మెంట్ వర్క్‌షాపు నిపుణులతో ఒక్కరోజు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎస్పీ మాట్లాడుతూ ముఖ్యమైన కేసుల దర్యాప్తునకు ఫోరెన్సిక్ ఆధారాలు కీలకమన్నారు. పోలీసు అధికారులు ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని దర్యాప్తు పద్ధతులపై లోతైన అవగాహన కలిగి ఉండాలన్నారు. ఫోరెన్సిక్ శిక్షణ వలన ఆధారాల సేకరణ, వాటి విలువపై స్పష్టత కల్గి నేరవిచారణపై బలమైన ఆధారాలను సేకరించే శక్తి వస్తుందన్నారు. ఫోరెన్సిక్ నిపుణులు అనంతపురం ఆర్ఎఫ్ఎస్ఎల్ ఫోరెన్సిక్ సైంటిఫిక్ అధికారి కుళ్లాయమ్మ, అశోక్‌కుమార్, మంగళగిరి నుంచి వచ్చిన ఎఫ్ఎస్ఎల్ సైంటిఫిక్ అసిస్టెంట్లు మురళీ, వెంకటేశ్వరరావులు పోలీసు అధికారుల సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం ఫోరెన్సిక్ నిపుణులకు జిల్లా ఎస్పీ మెమెంటోలను అందచేసి సత్కరించారు. కార్యక్రమంలో డీఎస్పీ విజయ్‌కుమార్, ట్రైనీ డీఎస్పీ ఉదయపావని, డీసీఆర్బీ సీఐ శ్రీనివాసులు, ఫింగర్‌ప్రింట్ ఎస్సై అనిల్‌కుమార్, జిల్లాలోని సీఐలు, ఎస్సైలు సైబర్ పోలీసు సిబ్బంది, ఐటీకోర్ సిబ్బంది పాల్గొన్నారు.

కుక్కె ఆలయ కమిటీ చైర్మన్‌గా హరీశ్ ఇంజాడి

» రౌడీషీటర్ జాబితాలో పేరు

బెంగళూరు, మే 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రముఖ ఆలయాలలో ఒకటైన కుక్కె సుబ్రమణ్య ఆలయ కమిటీ చైర్మన్‌గా హరీశ్ ఇంజాడిని ఎంపిక చేశారు. హరీశ్ నియామకం పట్ల రాజకీయ, సమాజంలోని వివిధ వర్గాలనుంచి వ్యతిరేకత వ్యక్తం అవుతోంది. కాంగ్రెస్ అధిష్ఠానం నిర్ణయాన్ని హిందూ, ఆధ్యాత్మిక సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి. కడబ తాలూకాకు చెందిన హరీశ్ ఇంజాడి కాంగ్రెస్ పార్టీ గ్రామపంచాయతీ సభ్యుడిగా ఉన్నారు. గత కొన్నేళ్లుగా హరీశ్ ఇంజాడిపై పలు ఆరోపణలు ఉన్నాయి. నకిలీ చెక్ ఇచ్చారనే ఆరోపణపై కేసు నమోదు కాగా ఆలయ పరిధిలో టెంకాయల టెండర్లలో గుడికి మోసం చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఇతడిపై గతంలో రౌడీషీటర్‌గానే పేరుండేది. హరీశ్ పేరు ప్రస్తావన రాగానే పలువురు దేవదాయశాఖ మంత్రి రామలింగారెడ్డికి లేఖలు పంపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ హరీశ్ ఇంజాడికి అవకాశం ఇవ్వరాదని కోరారు. అయినా అతడిపేరు ఖరారు కావడంపై దక్షిణకన్నడ జిల్లాలో మంత్రి నిర్ణయంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతోంది.

ఎస్ఐ పోస్టు నియామకాల జాప్యంపై నిరసన



ఫ్రీడంపార్కులో వినూత్నంగా నిరసన ఇలా...

బెంగళూరు, మే 13(ఆంధ్రజ్యోతి): 402 ఎస్ఐ పోస్టుల నియామకానికి సంబంధించి ప్రభుత్వం జాప్యం చేయడాన్ని ఖండిస్తూ నగరంలో మంగళవారం ఫ్రీడంపార్కులో వినూత్నంగా నిరసన తెలిపారు. ఆల్ కర్ణాటక స్టేట్ స్టూడెంట్స్ అసోసియేషన్ సభ్యులు ప్లకార్డులు ప్రదర్శించారు. నాలుగు సంవత్సరాలు గడిచినా నియామకం చేయకపోవడం సరికాదన్నారు. శాంతిభద్రతలు కాపాడే రక్షకుల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందంటూ మండిపడ్డారు.

16న రాజరాజేశ్వరి కళానికేతన్ స్వర్ణోత్సవం

బెంగళూరు, మే 13(ఆంధ్రజ్యోతి): రాజరాజేశ్వరి కళానికేతన్ 50ఏళ్ల పూర్తి అయిన సందర్భంగా ఈనెల 16న స్వర్ణోత్సవం నిర్వహిస్తున్నారు. ప్రముఖ సంగీత దర్శకులు ప్రవీణ్ డీ రావ్ సారథ్యంలోని పారం ఫౌండేషన్, గోకులం స్కూల్ ఆఫ్ మ్యూజిక్, అకాడమీ ఆఫ్ మ్యూజిక్ బెంగళూరు సంయుక్తంగా నృత్యరంగోళి అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. చౌడయ్య మెమోరియల్‌లో సాయంత్రం 5.30 గంటలకు కళాప్రదర్శనలు ఉంటాయన్నారు. నగర పరిధిలోని 12కుపైగా నృత్య సంస్థల కళాకారులు భిన్నమైన శైలిలో అద్వితీయమైన నృత్యరచన శ్రీకృష్ణ లీలార్ణవ హుట్టి నుంచి భగవద్గీత దాకా అనే ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రదర్శించనున్నారు. 200మందికిపైగా కళాకారులు ప్రదర్శనలు ఇస్తున్నట్టు తెలిపారు.

గ్రామీణ ఉత్పత్తులకు బ్రాండింగ్ పెరగాలి



మేళాలో ఎమ్మెల్యే రవికుమార్ తదితరులు

శిడ్లఘట్ట, మే 13(ఆంధ్రజ్యోతి): అనేక స్వసహాయ సంఘాలు చేతి వృత్తుల ద్వారా సిద్ధం చేసిన వస్తువుల విక్రయంలో మార్కెటింగ్ విషయంలో నైపుణ్యం కొరతతో ఆశించిన మేరకు సాగడం లేదని ఎమ్మెల్యే బీఎన్ రవికుమార్ విచారం వ్యక్తం చేశారు. చిక్కబళ్ళాపుర జ్ఞానోదయ గ్రామీణ విద్యాసంస్థ, సంజీవిని సంస్థ సహకారంతో స్వసహాయసంఘాల ఉత్పత్తులను ప్రదర్శన, విక్రయ మేళాను ప్రారంభించి మాట్లాడారు. మహిళలు స్వాభిమానంతో జీవించేందుకు తమ పిల్లలకు ఉత్తమ విద్య అందించాలన్నారు. తగిన మార్కెట్ లేకపోవడంతో ఆశించిన మేర లావాదేవీలు లేవన్నారు. వస్తువుల నాణ్యత బాగున్నా, సరైన బ్రాండ్‌నేమ్, ప్యాకింగ్‌తో మార్కెటింగ్ పెంచుకోవాలన్నారు. గ్రామపంచాయతీ స్థాయి 12 సమాఖ్యలు, 28 స్వసహాయసంఘాలు మేళాలో పాల్గొన్నాయి. మేళాలో నగరసభ అధ్యక్షుడు బంకు మునియప్ప, తాలూకా పంచాయతీ మాజీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణరెడ్డి, జ్ఞానోదయ గ్రామీణ విద్యాసంస్థకు చెందినవారు తదితరులు పాల్గొన్నారు.

చవితి వేడుకలకు సన్నాహాలు చేసుకోండి: జేసీ

పుట్టపర్తి టౌన్, మే 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో రానున్న వినాయ చవితి వేడుకలను ప్రశాంతంగా నిర్వహించడానికి ముందస్తు సన్నాహాలు చేసుకోవాలని జేసీ అభిషేక్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో డీఆర్వో విజయసారథితో కలిసి కదిరి ప్రాంతానికి చెందిన గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో మంగళవారం ఆయన సమీక్షించారు. జేసీ మాట్లాడుతూ రానున్న వినాయక చవితి వేడుకలు ప్రశాంతంగా నిర్వహించుకోవడానికి ఉత్సవ కమిటీ సభ్యులు అధికారులకు సహకరించాలన్నారు. ప్రస్తుతమున్న పరిస్థితుల దృష్ట్యా సామరస్యంగా ఈవేడుకలు నిర్వహించుకోవడానికి ప్రతిఒకరు సహకరించాలన్నారు. సహజ సిద్ధమైన పదార్థాలు, మట్టితో వినాయక విగ్రహాల తయారీని ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో కదిరి ఆర్డీవో వీవీఎస్ శర్మ, విద్యుత్‌శాఖ ఎస్ఈ సంపత్‌కుమార్, తహసీల్దార్ మురళీకృష్ణ, జిల్లా విపత్తు నివారణ శాఖ అధికారి హేమంత్‌రెడ్డి, దేవదాయ అసిస్టెంట్ కమిషనర్ నరసింహరాజు, కదిరి గణేష్ ఉత్సవ కమిటీ చైర్మన్ నాగేంద్ర ప్రసాద్ తదితరులున్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1586.16	1,577.62
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	1,547	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	279	11
నీటి నిల్వ (టీఎంసీలు)	8.11	3.42

ఎయిమ్స్ పోరాటానికి మూడేళ్లు పూర్తి..!

రాయచూరు, మే 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎయిమ్స్ ఏర్పాటు కోరుతూ పోరాట సమితి ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన మంగళవారం నాటికి మూడేళ్లు పూర్తైంది. నాల్గవ ఏటకు తమ పోరాటం అడుగు పెడుతున్న సందర్భాన్ని పురస్కరించుకుని ఎయిమ్స్ సాధన పోరాట సమితి నాయకులు నగరంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద మానవహారం ఏర్పాటు చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాయచూరులో ఎయిమ్స్ ఏర్పాటు పట్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న నిర్లక్ష్య ధోరణిని నిరశిస్తు పోరాట సమితి నాయకులు నినాదాలు చేశారు. అనంతరం కరవే జిల్లాధ్యక్షుడు అశోక్ కుమార్ సీకే జైన్ తదితరులు తమ చెప్పులను చేతపట్టుకుని నేలకు చెరస్తూ వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడిన పోరాట సమితి కన్వీనర్ బసవరాజ్ కళస రాయచూరు జిల్లాకు ఎయిమ్స్‌ను సాధించే వరకు తమ పోరాటం ఆపేది లేదని స్పష్టం చేశారు. నాయకులు, ప్రజాప్రతినిధులు పార్టీలకు రాజకీయాలకు అతీతంగా జిల్లాలో ఎయిమ్స్ కోసం ఏక తాటిపైకి రావాలని తమ పోరాటానికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు.

వ్యక్తి ఆత్మహత్య

బళ్లారిరూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి) : తాలుకాలోని రూపనగుడి గ్రామం వద్ద పాల్తూరు గ్రామానికి చెందిన సుధాకర్ (22) అనే వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆదివారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు పీడీహళ్లి పోలీసులకు తెలియజేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సుధాకర్ ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉందని, కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టినట్లు పీడీ హళ్లి పోలీసులు తెలిపారు.

తోరణగల్లులో భారీ వర్షం

తోరణగల్లు, మే 13 (ఆంధ్రజ్యోతి) : సండూరు తాలుకాలో మంగళవారం ఉదయం భారీ వర్షం కురిసింది. సండూరులో 17.8 మిల్లీమీటర్లు, కురేకుప్పలో 13.2 మిల్లీమీటర్లు, విఠలా పురంలో 7.2 మిల్లీమీటర్లు ,చోర్నూరులో 30.2 మిల్లీమీటర్లు వర్షం కురిసినట్లు అధికారులు తెలిపారు.

టీడీపీని బలోపేతం చేయండి : పల్లె

నల్లమాడ, మే 13(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో టీడీపీ క్షేత్ర స్థాయిలో బలోపేతం చేయడానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి సూచించారు. మంగళవారం సాథనిక షాదీమహాల్‌లో కార్యకర్తలతో నిర్వహించిన సాధారణ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యకర్తల కృషితోనే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. 2029లోపు అన్ని చెరువులకు నీరు ఇచ్చి, నియోజకవర్గానికి మరో కోస్తా ఆంధ్రగా మార్చుతామన్నారు. అనంతరం మండలంలో గ్రామ, సాధికార సారథి, బూత్ కమిటీలను, అధ్యక్షులు, కన్వీనర్లు, కో కన్వీనర్లను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ షైలే శివశంకర్, మాజీ కన్వీనర్ కేశవరెడ్డి, సర్పంచ్‌లు భారతి, ప్రభాకరరెడ్డి, నాయకులు బుట్టి నాగభూషణనాయుడు, ఎల్ఐసీ నరసింహులు, గడ్డం రమణారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నగరం..జలమయం..!



జలమయమైన హాకీ కోర్టు



నీళ్లలో నిలిచిపోయిన కారు

బళ్లారి, మే 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రాంతాల్లో జోరువాన ముంచెత్తింది. సోమవారం రాత్రి మొదలయిన వర్షం మంగళవారం ఉదయం వరకు కొనసాగింది. రాత్రి నుంచి ఏకదాటిగా కురిసిన వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ఎటు వంటి ప్రాన , పంట నష్టం జరగలేదని అధికారులు పేర్కొన్నారు. బళ్లారి బీడీఏ మైదానం పూర్తిగా నీటితో నిండిపోయింది. సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్, హాకీ కోర్టు పూర్తిగా నీటిలో మునిగిపోయాయి. వాన నీరు బయటకు వెళ్లేందుకు ఏర్పాట్లు చేయకపోవడం వల్లే ట్రాక్ మునిగిపోయిందని క్రీడాకారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్టేడియంలో దాదాపు అడుగు లోతు నీరు చేరింది. కొత్త డీసీ కార్యాలయం. పాత డీసీకార్యాలయం, రిజిస్ట్రేషన్‌కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయాల్లో నీరు చేరాయి. కొత్త డీసీ కార్యాలయంలో బ్లాక్- ఏ లోని 30-31 గదులు వాన నీరు కారుతుండడంతో ఫైల్స్ తడిసిపోయాయి. హుసేన్‌నగర, బండిమోట, ఏపీఎంసీ మార్కెట్, కనేకల్లు బస్టాండు, కౌల్‌బజార్ ప్రాంతాల్లో నీరు చేరి డ్రైనేజీ పొంగి పొర్లింది. ఉద్యోగులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

వర్షంతో వాహనదారుల ఇబ్బందులు

బళ్లారిరూరల్ : బళ్లారి నగరంలో సోమవారం వర్షం దంచికొట్టింది. రాత్రి 11 నుంచి 3 గంటల వరకు కురిసిన భారీ వర్షంతో నగరంలో లోతట్టు ప్రాంతాల్లో నీరు ఇళ్లలోకి చేరింది. బెంగళూరు రోడ్డు సమీపంలోని జోళదరాసి దొడ్డరంగ మందిరం రైల్వే అండర్ బ్రిడ్జి సమీపంలో భారీ వర్షానికి అండర్‌బ్రిడ్జిలో అత్యధికంగానే రావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. అయితే ఎండలు మండుతున్న సమయంలో వర్షంతో నగరవాసులు కాస్త ఉపశమనం పొందుతున్నారు.



వర్షపు నీటితో నిండిపోయిన అండర్‌పాస్

బెంగళూరులో ఓ మోస్తరు వర్షం



బెంగళూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగరంలో మంగళవారం మధ్యాహ్నం ఒక మోస్తరు వర్షం కురిసింది. ఒక్కసారిగా మేఘావృతమై దట్టమైన మబ్బులు కమ్మేసి వర్షం కురిసింది. మెజస్టిక్, కేఆర్ మార్కెట్, లాల్‌బాగ్, జయనగర్, శాంతినగర్, శివాజినగర్, హెబ్బాళ్ తదితర ప్రాంతాల్లో వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు జలమయం కాగా వాహన సంచారానికి కొంత అంతరాయం నెలకొంది.

వర్షపునీటిలో వాహనదారుల సంచారం ఇలా

స్టాక్ మార్కెట్ పేరుతో భారీ మోసాలు

- నిందితుడి అరెస్ట్.. రూ.5 లక్షలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న నగదును చూపుతున్న పోలీసులు

బళ్లారిరూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి) : ఆన్‌లైన్ మోసాలతో అమాయకులను మోసం చేస్తున్న నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు విజయనగరం జిల్లా కొత్తపేటకు చెందిన రంజిత్ స్టాక్ మార్కెట్లో అధిక లాభాల పేరుతో పలువురి నుంచి రూ.లక్షల్లో వసూళ్లు చేశారు. అధిక వడ్డీలు చెల్లించి అమాయకులను మోసం చేస్తున్నాడు. పలువురి ఫిర్యాదు మేరకు నిందితుడిని అరెస్ట్ చేశారు. కేసు నమోదు చేసి రంజిత్ నుంచి రూ. ఐదు లక్షలు స్వాధీనం చేసుకున్నారు. ఆన్‌లైన్ మోసాలతో అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.

అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఏకగ్రీవం



అధ్యక్షు, ఉపాధ్యక్షులను అభినందిస్తున్న సభ్యులు

కంప్లి, మే 13 (ఆంధ్రజ్యోతి) : తాలుకా పరిధిలోని మెట్రి గ్రామ పంచాయతీ అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. 20 మంది సభ్యులు వుండగా అధ్యక్ష స్థానానికి నాగమ్మ నామినేషన్ వేశారు. ఉపాధ్యక్షు స్థానానికి మహంతేష్ నామినేషన్ వేశారు. ఎవరూ పోటీ లేనందువలన వారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి తాలుకా ఈఓ శ్రీకుమార్ తెలిపారు. అధ్యక్ష, ఉపాధ్యక్షులను సభ్యులు అభినందించారు. ఈ కార్యక్రమంలో 18 మంది గ్రామ పంచాయతీ సభ్యులు తాలుకా అసిస్టెంట్ డైరెక్టర్ మల్లనగౌడ్, పీడీఓ బీరలింగ, గంగాధరగౌడ సీడీపీవో మహదేవ, వస్కోటి జగదీష్, గణేష్, దుర్గప్ప, శంకరప్ప తదితరులు పాల్గొన్నారు.



దరూరు పుల్లయ్యకు నివాళి అర్పిస్తున్న ఏపీ సీపీఐ నేత జగదీశ్

సాగునీటి కోసం కృషి చేసిన మహనీయుడు

- మాజీ ఎంపీ దరూరు పుల్లయ్యకు సీపీఐ ఏపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జగదీశ్ నివాళి

బళ్లారి, మే 13(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లాకు సాగునీటి కోసం అహర్నిశలు కృషి చేసిన గొప్ప వ్యక్తి దరూరు పుల్లయ్య అని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జగదీష్ అన్నారు. మంగళవారం మాజీ పార్లమెంట్ సభ్యులు దరూరు పుల్లయ్య భౌతిక కాయానికి బళ్లారిలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనంతపురం జిల్లాలో సాగునీటి కోసం పుల్లయ్య అహర్నిశలు కృషి చేశారన్నారు. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం పూర్తి చేయడానికి ఎన్నో ఆందోళన కార్యక్రమాలు చేపట్టారన్నారు. ఆయన అన్ని రాజకీయ పార్టీలను, రైతు సంఘాలను సమన్వయం చేసుకుని సాగునీటి ప్రాజెక్టుల కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో బళ్లారి జిల్లా యువజన సమాఖ్య అధ్యక్షుడు బసప్ప పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నేడు దరూరు పుల్లయ్య అంత్యక్రియలు

అనంతపురం మాజీ ఎంపీ దరూరు పుల్లయ్య అంత్యక్రియలు బుధవారం బళ్లారిలోని హరిశ్చంద్ర ఘాట్‌లో నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సోమవారం గుండెపోటుతో ఆయన కన్నుమూసిన సంగతి తెలిసిందే. మంగళవారం పుల్లయ్య భౌతిక కాయాన్ని బళ్లారిలోని పుల్లయ్య కాంపౌండ్ ఆయన స్వగృహంలో అభిమానుల సందర్శనార్థం ఉంచారు. అనంతపురం, కర్నూలు, బళ్లారి, హైదరాబాద్ నుంచి వచ్చిన పలువురు నేతలు ఆయనకు నివాళి అర్పించారు.

ఇనుప చక్రాలతో ట్రాక్టర్ నడుపవద్దు

- రహదారుల భద్రతపై రైతులు దృష్టి పెట్టాలి : ఎమ్మెల్యే



రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే గణేష్

కంప్లి, మే 13(ఆంధ్రజ్యోతి): కంప్లి నియోజకవర్గంలో గ్రామాల్లో రైతన్నలు మాటలు వేసే సమయంలో తమ ఇంట్లో నుండి పొలాల వరకు ట్రాక్టర్‌కు ఇనుప చక్రాలు రోడ్లపై నడుపవద్దని ఎమ్మెల్యే గణేష్ సూచించారు. మంగళవారం రూ. 4.90కోట్లతో దేవసముద్రం వద్ద చిక్కజాగనూరు వెళ్లే రోడ్డు పనులు ఎమ్మెల్యే భూమిపూజ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో గ్రామాల్లో ప్రజల దృష్టిలో వుంచుకుని రోడ్డు అభివృద్ధి పనులకు రూ.కోట్లు జారీ చేయించామన్నారు. రైతులు వీల్ చక్రాలతో రోడ్లు పూర్తిగా ధ్వంసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాలూరు క్రాస్ నుంచి కురుగోడు వరకు, కురుగోడు నుంచి ఎమ్మిగనూరు వరకు ఎమ్మిగనూరు నుంచి కంప్లి, కంప్లి రాంసాగర్ నుండి దాదాపు 37 కిలో మీటర్లతో సహా మొత్తం 67 కిలోమీటర్ల రోడ్లు అభివృద్ధి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ అధ్యక్షుడు కే శ్రీనివాసరావు గ్రామ పంచాయతీ అధ్యక్షుడు మాయప్ప, సభ్యులు నాయక్కర వెంకోబా, మౌనేషా నాయకులు, కే షణ్ముఖప్ప, హెచ్ గుండప్ప, కోరి చన్నబసు, కరియప్ప, చానాల్ పక్కీరప్ప, కోరి నాగేంద్రప్ప, దొడ్డనాయక, విరుపన్న, అంజిని తదితరులు పాల్గొన్నారు.

పశువులు, పక్షుల దాహం తీర్చండి

- 'మీ కోసం' ఆధ్వర్యంలో గిన్నెలు, తొట్టెల పంపిణీ



గిన్నెలు పంపిణీ చేస్తున్న సంస్థ సభ్యులు

బళ్లారి సిటీ, మే 13(ఆంధ్రజ్యోతి): వేసవి సందర్భంగా పశువులు, పక్షులు దాహంతో అల్లాడుతాయని, ప్రతి ఇంటి దగ్గర నీటి తొట్టెలు ఏర్పాటు చేయాలని 'మీ కోసం మేము' స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు వినయ్ కుమార్ అన్నారు. మంగళవారం నగరంలోని డీఏఆర్ పాఠశాల ఆవరణలో సంస్థ తరపున ఉచి గిన్నెలు, తొట్టెలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా వినయ్ మాట్లాడుతూ ఎండవేడిమి కారణంగా మూగజీవులు ఇబ్బంది పడుతున్నాయని, ప్రతి ఒక్కరూ మన తోటి జీవులను రక్షించుకోవడానికి తమ వంతు కృషి చేయాలన్నారు. ప్రాజెక్ట్ కార్యదర్శి నాగరజ్ మాట్లాడుతూ గిన్నెలు, డబ్బాలు ఉచిత పంపిణీ మే నెల అంతా కొనసాగుతుందన్నారు. ఆసక్తి ఉన్నవారు సంస్థ మొబైల్ నంబర్ 9448584400ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో సంస్థ కార్యవర్గ సభ్యులు శివరాజ్, మారుతి, మెహబూబ్‌బాష,సందీప్, ఆనంద్ యోగి, రఘు నాగరాజ్, సాగర్, హర్షవర్దన్, రాజు, అనిల్, బాలసుబ్రహ్మణ్యం, కేదార్‌నాథ్, ఉద్రేశ్ తదితరులు పాల్గొన్నారు.

పది ఫలితాల్లో 'నారాయణ' ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రజని

బళ్లారిరూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి) : 2024-25 విద్యా సంవత్సరానికి సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకెండరీ ఎడ్యుకేషన్ ఎగ్జామినేషన్ నిర్వహించిన పదవ తరగతి ఫలితాల్లో బళ్లారి నారాయణ స్కూలు విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధింఆచరు. విద్యార్థిని సీఆర్ హర్నిత 500 మార్కులకు గాను 492 మార్కులతో జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచింది. పరీక్షకు హాజరైన 86 మంది విద్యార్థులందరూ ఉత్తీర్ణులయి వంద శాతం ఫలితాలు సాధించారు. ఏజీఎం బాషా, ప్రిన్సిపాల్ రజని, మేనేజర్ దేవరాజు, సిబ్బంది విద్యార్థులను అభినందించారు.

పార్టీలకు అతీతంగా సీఎం సహాయ నిధి

నల్లచెరువు/కదిరి, మే 13(ఆంధ్రజ్యోతి): పార్టీలకు అతీతంగా సీఎం సహా య నిధి మంజూరయ్యేలా ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ చొరవ చూపారు. నల్లచెరువు మండలం ఎం.అగ్రహారానికి చెందిన వైసీపీ నాయకుడు కోటిరెడ్డి గతంలో గుండె ఆపరేషన్ చేయించుకున్నారు. ఆర్థిక సా యం కోసం సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నారు. దీంతో అతనికి రూ.2,28,323 మంజూరైంది. ఇతనితో పాటు నియోజకవర్గంలోని మరో 17 మందికి సీఎం సహాయ నిధి మంజూరైంది. వీరందరికీ మొత్తం రూ.16,32,664 మంజూరు కాగా, మంగళవారం కదిరి ఆర్అండ్ అండ్‌బీ బంగాల్లో బాధితులకు ఆయా చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. దీంతో వారు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపారు.

హోసూరు జోన్

వైభవంగా మారియమ్మన్ ఆలయ ఉత్సవం



హోమం నిర్వహిస్తున్న పండితులు

హోసూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): హోసూరులో పేరొందిన మారియమ్మన్ ఆలయం ఉత్సవం వైభవంగా జరిగింది. భక్తులు పెద్దసంఖ్యలో సూదితో శరీరాలను కుట్టుకుని, నడుముకు వేలాడుతూ మొక్కులు తీర్చుకున్నారు. రాంనగర్‌లోని వందల సంవత్సరాల పురాతనమైన అరుళ్మిగు మారియమ్మన్ ఆలయంలో పౌర్ణమిని పురస్కరించుకుని విశేషపూజలు నిర్వహించడం విశేషం. సరిహద్దులోని ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలనుంచి వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు.



ఊరేగింపులో భక్తులు

ప్రభుత్వ కార్యాలయంలో గంజాయి మొక్క

హోసూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): హోసూరులోని తాలూకా కార్యాలయం, కోర్టు, మహిళా పోలీస్‌స్టేషన్, పంచాయతీ యూనియన్ కార్యాలయంలో, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్, రెవెన్యూ కార్యాలయం ఇలా వివిధ ప్రభుత్వ కార్యాలయాల సముదాయ ప్రాంగణంలో గంజాయి మొక్కను గుర్తించారు. ప్రభుత్వ కార్యాలయాల కారణంగా నిత్యం వందలాదిమంది రాకపోకలు సాగిస్తుంటారు. మహిళా పోలీస్‌స్టేషన్ వెనుక కొత్త సర్వీస్ సెంటర్ భవనం సమీపంలో గంజాయి మొక్కలు తలెత్తడంతో చూసి ప్రభుత్వ అధికారులు ఆశ్చర్యపోతున్నారు. వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు



విజేతలకు బహుమతి అందజేస్తున్న పంచాయతీ అధ్యక్షుడు వీరేశప్ప

తోరణగల్లు, మే 13(ఆంధ్ర జ్యోతి): శంకర్ లింగ స్వామి రథోత్సవం సందర్భంగా జేఎస్‌డబ్ల్యూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రీడా పోటీఉలు ఉత్సాహంగా ముగిశాయి. సోమవారం సండూరు తాలుకాలోని తోరణగల్లు, తారానగర్ గ్రామంలో రెండు జట్లు ఏర్పాటు చేసి పోటీలు నిర్వహించారు. తోరణగల్లు క్రికెట్ పోటీల్లో 18 టీమ్‌లు 270 మంది యువకులు పాల్గొన్నారు. ప్రథమస్థానంలో ఆదిత్య తండా, ద్వితీయస్థానంలో తోరణగల్లు పాస్ టెస్ట్ గెలుపొందారు. తారానగర్ పోటీల్లో ఎనిమిది టీమ్‌లు 120 మంది యువకులు పాల్గొన్నారు. మొదటి బహుమతి మాస్టర్ నాయక్, రెండవ బహుమతి హర్ష క్రికెట్ జట్లు సాధింఆచరు. ఈ సందర్భంగా తోరణగల్లు కేఎస్ఎల్ స్వామి ప్రముఖులు ఏకాంబరప్ప గ్రామ పంచాయతీ అధ్యక్షుడు వీరేశప్ప, తారానగర్ ప్రముఖులు జీటీ పంపాపతి, తారానగర్ గ్రామ పంచాయతీ అధ్యక్షురాలు గీత, సభ్యులు జేఎస్‌డబ్ల్యూ ఫౌండేషన్ అధికారి మహమ్మద్ రఫీక్ మొదలగువారు పాల్గొన్నారు. గెలుపొందిన వారికి బహుమతులు అందించారు.

పారిశుధ్య కార్మికులకు కిట్‌ల పంపిణీ

రాయచూరు, మే 13(ఆంధ్రజ్యోతి) : మహానగర పాలిక పరిధిలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు మంగళవారం వివిధ రకాల కిట్‌లను అందజేశారు. మహానగర పాలికె కమిషనర్, స్పెషల్ ఆఫీసర్ జుబిన్ మొహపాత్ర చేతుల మీదుగా కార్మికులకు కిట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన కమిషనర్, నగర స్వచ్ఛత కోసం నిరంతరం శ్రమిస్తున్న కార్మికుల సంక్షేమం వారి ఆరోగ్యం పట్ల ప్రభుత్వానికి పూర్తి నిబద్ధత ఉందన్నారు. ఈ క్రమంలో వారికి కిట్‌లను అందజేస్తున్నట్లు తెలిపారు.



కార్మికులకు కిట్‌లను అందజేస్తున్న జుబిన్ మొహపాత్ర